జన సంద్రమైన ఉప్పల్

- అట్టహాసంగా నామినేషన్‌కు తరలిన మందముల
- ఉప్పల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం పక్కా
- అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం
- ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి

జంగ్ 2023 తెలంగాణ



ఉప్పల్‌లో పరమేశ్వర్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు



ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీగా తరలిన మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్/కుషాయిగూడ: ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి నామినేషన్ ర్యాలీతో ఉప్పల్ జన సంద్రమైంది. గురువారం ఆయన భారీ బైక్ ర్యాలీతో తరలివెళ్లి తన నామినేషన్ దాఖలు చేశారు. ఉప్పల్‌లోని రామచంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి బయలుదేరిన ఆయన సైనిక్‌పురి చౌరస్తాలోని జ్యోతిరావు పూలె విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించి కాప్రా నుంచి ఉప్పల్ వరకు ర్యాలీగా తరలివెళ్లారు. కిలోమీటరు మేరా బైక్‌ల హారన్ మోతలు, కాంగ్రెస్ నినాదాలతో రోడ్లన్నీ మార్మోగాయి. ప్రధాన కూడళ్ల వద్ద కాంగ్రెస్ అభిమానులు, మహిళలు ఆయనకు మంగళ హారతులతో స్వాగతం పలికి మద్దతు తెలిపారు. అలాగే జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ పార్టీల నేతలు ర్యాలీలో పాల్గొని వారి మద్దతు తెలిపారు. ఉప్పల్ చౌరస్తాలో పరమేశ్వర్‌రెడ్డి అభిమానులు గజమాలతో సత్కరించి నినాదాలతో హోరెత్తించారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం పక్కా అన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు అనేందుకు ఈ ర్యాలీ నిదర్శనం అన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చి తనకు మద్దతు తెలిపిన వారి రుణం తీర్చుకుంటానన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేసిందన్నారు. సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకే కట్టబెట్టారన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేసేలా రూపొందించిన ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి సేవ చేసే భాగ్యం కల్పించాలన్నారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సంక్షేమానికి పాటుపడతానన్నారు. నా విజయం కోసం శ్రమిస్తున్న కార్యకర్తల రుణం తీర్చుకుంటానంటూ ఉద్వేగభరితంగా ప్రసంగించి వారిలో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో ఉప్పల్ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాఘవరెడ్డి, అంజిరెడ్డి, సీపీఐ నేత బోసు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్‌లో తన నామినేషన్ వేసిన పత్రాన్ని చూపిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్‌లో గెలిచేది కాంగ్రెస్ పార్టీనే

ఉప్పల్: బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రభుత్వ భూములను అమ్ముకుని వ్యాపారం చేస్తోందని మందుముల పరమేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారికి అందజేశారు. ముందుగా ఉప్పల్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనగర్‌లో అమ్మవారి వద్ద, ఉప్పల్ బొడ్డురాయి శివలింగానికి పూజలు నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసం ఉందని, సోనియా గాంధీ ఇచ్చిన మాట ఆరు గ్యారంటీలు ప్రజలకు బాగా నచ్చాయన్నారు. మంత్రి హరీష్‌రావు చెప్పినట్లు ఎక్కడా నల్లా బిల్లులు మాఫీ కాలేదని, అంతా బూటకమన్నారు. కేసీఆర్ కిట్ల పంపిణీ ఏడాది క్రితం నిలిచిపోయిందన్నారు. దళితబంధు దగా, బీసీ బందు పచ్చి మోసం అన్నారు. డబుల్ ఇళ్లు ఎవరికీ అందలేదన్నారు.



భారీ ర్యాలీలో పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న శివయాదవ్

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌కు చెందిన బీజేపీ ఉపాధ్యక్షుడు మాడుగుల శివ యాదవ్, కో ఆప్షన్ సభ్యురాలు బద్దుల సుగుణ, బీఆర్ఎస్ నాయకులు పులకండ్ల వెంకట్‌రెడ్డి, తిరుమల మెడోస్ కాలనీ అధ్యక్షులు అమరేందర్‌తో పాటు పలువురు ఆయన సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ పట్ల ప్రజలు విసుగు చెందారని, కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు బొమ్మక్ రమేష్, నేతలు పొన్నం రవిగౌడ్, హరినాథ్‌రెడ్డి, చెంచల నర్సింగ్‌రావు తదితరులున్నారు.

బండ చెరువు కబ్జా కాకుండా చూస్తాం



బండ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మౌలాలి: డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో గురువారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పర్యటించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీ పథకాలను వివరించి, హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం బండ చెరువు కబ్జాకు గురవుతోందనే విషయం తెలుసుకున్న ఆయన వెంటనే బండ చెరువును పరిశీలించారు. కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, నాయకులు జీఎన్వీ సతీష్‌కుమార్, పిట్టల శ్రీనివాస్, గుండా నిరంజన్, వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్, వినోద్‌యాదవ్, ఉమేష్‌సింగ్, సంతోష్ రాందాస్, శ్యామ్‌రావు, బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



ఈసీఐఎల్ చౌరస్తాలో బండారికి స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



హెచ్‌బీకాలనీలో బండారికి స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి

కుషాయిగూడ: ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వెళ్లిన బండారి లక్ష్మారెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో పెద్ద ఎత్తున స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. మంగళ హారతులు పట్టి విజయబావుట ఎగురవేయాలన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీ ఇందిరాగాంధీ సర్కిల్‌లో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. బండారికి మద్దతుగా నినాదాలు చేస్తూ ఘనంగా సత్కరించారు. అనంతరం బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నామినేషన్‌కు తరలివెళ్లారు.

అట్టహాసంగా బీఎల్ఆర్ నామినేషన్

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తన నామినేషన్‌ను అట్టహాసంగా దాఖలు చేశారు. గురువారం సైనిక్‌పురిలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి భారీ ర్యాలీగా ఉప్పల్ సర్కిల్ ఆఫీస్‌లోని ఆర్వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు సమర్పించారు. అంతకుముందు తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు హారతి ఇచ్చి విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు. సమీపంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేసి బీఎల్ఆర్‌ను దీవించారు. సైనిక్‌పురి జ్యోతిరావు పూలే విగ్రహం వద్దకు చేరుకుని.. అక్కడి నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ, నాచారం మీదుగా ఉప్పల్ చేరుకున్నారు. అక్కడి నుంచి ఆర్వో కార్యాలయంలోకి వెళ్లి ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు ప్రభుదాస్, బొంతు శ్రీదేవితో కలిసి అధికారులకు బండారి లక్ష్మారెడ్డి తన నామినేషన్ పత్రాలు అందజేశారు.



సైనిక్‌పురిలో పూలే విగ్రహానికి నమస్కరిస్తున్న బండారి లక్ష్మారెడ్డి



సర్వమత ప్రార్థనలు నిర్వహిస్తున్న బండారి లక్ష్మారెడ్డి



బీఎల్ఆర్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం



బండారి లక్ష్మారెడ్డిని సత్కారిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. బండారి లక్ష్మారెడ్డి నామినేషన్ నేపథ్యంలో మల్లాపూర్ ప్రధాన రహదారిలో బండారి లక్ష్మారెడ్డి పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

మల్లాపూర్: ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బండారి లక్ష్మారెడ్డి నామినేషన్ దాఖలు చేయడానికి బయలు దేరిన బండారి లక్ష్మారెడ్డికి నాచారంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ విజయం తిలకం దిద్ది మంగళ హారతి పట్టింది. ఉప్పల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు నెమిలి కొండ భూపాల్‌రెడ్డి, మేకల ముత్యంరెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.



బండారి లక్ష్మారెడ్డికి విజయ తిలకం దిద్దుతున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు



ఉప్పల్: ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు ముందు ఎన్‌జీఆర్ఐ గేట్ వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు పల్లె నర్సింగ్‌రావు, సీనియర్ నాయకులు కొండల్‌రెడ్డి, జగన్ తదితరులున్నారు.

విద్యార్థినులు నాయకత్వాన్ని పెంపొందించుకోవాలి



మల్లాపూర్: విద్యార్థినులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని యుఎస్ కన్సల్ట్ పబ్లిక్ ఆఫైర్స్ ఆఫీసర్ అలెక్స్‌ండర్ ఎంసీ లారెన్ అన్నారు. గురువారం నాచారం సెయింట్ ఫాయిస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇన్వెస్టిచర్ క్లబ్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూఎస్ కన్సల్ట్ పబ్లిక్ ఆఫైర్స్ ఆఫీసర్ అలెక్స్‌ండర్ ఎంసీ లారెన్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేసి ప్రమాణం చేయించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మట్లాడారు. ప్రసుత్తం సమాజంలో తారతామ్యం లేకుండా విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కరస్పాండెంట్ రెవ, ఆల్ఫోన్సా, ప్రిన్సిపాల్ వేలాంగిణి కుమారి, సెంథిల్ కుమార్, నూషీణ అలీ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి బీజేపీలో ఉత్కంఠకు తెర

నేడు రాంచందర్‌రావు నామినేషన్ దాఖలు



మల్కాజిగిరి: మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠకు తెరపడింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ అభ్యర్థిగా మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా మైనంపల్లి హన్మంతరావును ప్రకటించడంతో కొన్ని రోజులుగా ప్రచారంలో ముందంజలో ఉన్నారు. బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్‌తో పాటు పార్టీ కార్పొరేటర్లు, బీజేవైఎం నాయకులు టీంసాయి, భానుప్రకాష్ ఎమ్మెల్యే టికెట్టు కోసం ప్రయత్నాలు చేశారు. బీసీ అభ్యర్థికి కేటాయిస్తారన్న ఊహాగానాలకు తెరదించుతూ మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావునే అభ్యర్థిగా ప్రకటించారు. నామినేషన్లకు చివరి రోజైన శుక్రవారం ఆనంద్‌బాగ్ నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేస్తానని రాంచందర్‌రావు తెలిపారు.

పేద కుటుంబానికి చేయూత



గౌతంనగర్: ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు చేయాలని ప్రముఖ సంఘ సేవకులు సత్యనారాయణ, సాదు పరమేష్ అన్నారు. ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన పద్మమ్మ అతి చిన్న వయస్సులో కిడ్నీలు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చిన్న పిల్లలు ఉన్న ఆమె దీనస్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న జేఎల్ఎన్ఎస్‌కు చెందిన సత్యనారాయణ, సాదు పరమేష్‌లు ఆమె కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రాజు, సాయికిరణ్, సాయికిరణ్, సిద్ది రాములు, షేక్, నాని తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి..



నామినేషన్ పత్రాన్ని చూపిస్తున్న ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో చీకటి నుంచి వెలుతురులోకి తీసుకొచ్చిన మహానేత కేసీఆర్ అని బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఉప్పల్ రిటర్నింగ్ కార్యాలయంలో రెండుసెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, నాచారం మహంకాళి ఆలయంలో, ఉప్పల్ అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి ఉప్పల్‌లో నామినేషన్ వేశారు. నామినేషన్ అనంతరం ఉప్పల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు, అభివృద్ధి తన గెలుపు ముఖ్య కారణమవుతాయన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే తమ ప్రచార అస్త్రాలన్నారు. నాలుగున్నర సంవత్సరాల్లో తమ ప్రభుత్వం, ఉప్పల్‌లో దాదాపు అభివృద్ధికి రూ.2,500 కోట్లు ఖర్చుపెట్టినట్లు గుర్తు చేశారు.

మల్కాజిగిరి స్థానానికి తొమ్మిది నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేసిన మైనంపల్లి హన్మంతరావు



నామినేషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ స్థానానికి ఆరో రోజు తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ పేరుతో దండుగల వెంకటేష్, రామిశెట్టి రామకృష్ణ, ప్రజా వెలుగు పార్టీ నుంచి లొగ్గరి రమేష్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి సగరము శ్రీధర్, స్వతంత్ర అభ్యర్థులుగా మాలోత్ శంకర్, పిట్ల మోహన్‌రాజ్ నామినేషన్లు దాఖలు చేశారు.

- బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు ఆయన సతీమణి మర్రి మమతారెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతాయాదవ్, జేఏసీ వెంకన్న, ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, పరశురామిరెడ్డి ఉన్నారు.
- కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు నామినేషన్ దాఖలు చేశారు. కార్పొరేటర్ ప్రేమ్ కుమార్,జితేంద్రనాథ్ ఉన్నారు.
- స్వతంత్ర అభ్యర్థిగా మైనంపల్లి హన్మంతరావు సతీమణి మైనంపల్లి వాణి నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం చర్చనీయాంశమైంది.

పేదలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్



చర్లపల్లిలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



పూజలు చేసి నామినేషన్ వేయడానికి ఊరేగింపుగా వెళ్తున్న ప్రభాకర్

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలో తన హయంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను పూర్తి చేసిన బీఆర్ఎస్ నాయకులు తామే అభివృద్ధి చేశామని చెప్పడం సిగ్గుచేటని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఉప్పల్ అభ్యర్థి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి, చిన్న చర్లపల్లి, చర్చ్‌కాలనీ, ఇందిరా గృహకల్ప కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో ఉప్పల్‌లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు బీఆర్ఎస్ నాయకులు పక్షపాత వైఖరి ప్రదర్శించి నిజమైన పేద లబ్ధిదారులకు అన్యాయం చేశారన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే పేదలందరికీ న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

పూజలు చేసి ఊరేగింపులో నామినేషన్ వేసి..

రామంతాపూర్: ఉప్పల్ బీజేపీ అభ్యర్థి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ గురువారం ఉదయం తనకు అన్ని విధాలా అచ్చొచ్చే మంచి శకునం శుభాలు కలిగించే రామంతాపూర్‌లోని శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి కార్పొరేటర్లు బండారి శ్రీవాణి వెంకట్‌రావు, కక్కిరేణి చేతన హరీష్‌తో కలిసి కార్యకర్తలు నేతలతో భారీ ఊరేగింపులో పాల్గొని నామినేషన్ వేశారు.

11వ ప్రధాని నరేంద్రమోదీ రాక

అల్వాల్: ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగా అభ్యర్ధన మేరకు దేశ ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 11వ తేదీ శనివారం నగరానికి రానున్నట్లు ఎస్సీ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. గురువారం అల్వాల్ ఆయన మాట్లాడుతూ 29 ఏళ్లుగా మంద క్రిష్ణ మాదిగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని పోరాటాలు చేస్తున్నారన్నారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ల వలన ఎస్సీ మాదిగా, మాదిగ ఉప కులాలు మాత్రమే ఎక్కువగా నష్టపోయారన్నారు. ఉద్యోగ సామాజిక రాజకీయ సామాజిక రంగంలో న్యాయం కోసం, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల ఫలాలను సమంగా పెంచాలని మంద క్రిష్ణ మాదిక అహర్నిశలు పోరాటాలు చేస్తున్నారన్నారు. 11న జరగబోయే సభకు అందరూ హాజరు కావాలని పిలుపు నిచ్చారు.

ప్రజలు బీజేపీనే ఆదరిస్తారు.. ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్



ఉప్పల్‌లో నామినేషన్ పత్రాన్ని చూపుతున్న బీజేపీ అభ్యర్థి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

ఉప్పల్: ఉప్పల్ బీజేపీ అభ్యర్థి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తన నామినేషన్‌ను కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, గడ్డ సాయితో కలిసి గురువారం ఉప్పల్ ఎన్నికల కార్యాలయంలో దాఖలు చేశారు. ముందుగా రామంతాపూర్ సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి నామినేషనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్‌లో పోటీ రసవత్తరంగా మారబోతుందన్నారు. ఒక వైపు దళారులు, కాంట్రాక్టర్లు, అవకాశవాద నాయకులు కొత్త కొత్త అవతారాలతో పార్టీల్లో చేరి అభ్యర్థులుగా రంగంలోకి దిగారని ఘాటుగా విమర్శించారు. నిత్యం ప్రజల్లోనే ఉండే తననే ఉప్పల్ ప్రజలు ఆదరిస్తారని దీమా వ్యక్తం చేశారు. ఉప్పల్‌లో నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభం కావాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.